RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:208 | బుధవారం | 02 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098



## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- అనవసరంగా బంగారాన్ని కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమష్టి కృషితోనే జీడీపీ వృద్ధి రేటు
- ఇన్‌స్టా వేదికగా ప్రజలకు ప్రధాని మోదీ అభినందనలు

4



## క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

- క్రిటికల్ మినరల్స్ పరిశోధనకు త్రిముఖ భాగస్వామ్యం
- మోనాష్-ఐఐటీ హైదరాబాద్-సింగరేణి సంయుక్తంగా ముందడుగు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

## అంతుచిక్కని కాంగ్రెస్ పార్టీ పరిణామాలు

- హస్తినలో రేవంత్–వేణుగోపాల్ భేటీ
- కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై చర్చ
- నామినేటెడ్ పదవుల భర్తీపై కసరత్తు
- కేబినెట్ విస్తరణపైనా ఆసక్తికరచర్చలు
- రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ మంత్రాంగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:**

తెలంగాణ కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు అంతుచిక్కని రాజకీయానికి దారితీస్తున్నాయి. ఓవైపు కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై పార్టీ క్రమశిక్షణా కమిటీ నివేదికలు, మరోవైపు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానం కసరత్తు నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయం హస్తినకు చేరింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

**రాష్ట్ర రాజకీయాలపై చర్చ**

కేసీ వేణుగోపాల్‌తో సమావేశంలో తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ వ్యవహారాలు, నామినేటెడ్ పదవుల భర్తీ, పార్టీ బలోపేతం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంపైనా ఇరువురు నేతలు మాట్లాడినట్లు తెలుస్తోంది.

**కొండా సురేఖ వ్యవహారం**

మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో నెల కొన్న వివాదం, దానిపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక

మిగతా 2వ పేజీలో..

## ‘ఫీజు’ బకాయిలు తక్షణం విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గత రెండున్నరేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ,

మిగతా 2వ పేజీలో..



## గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలి

- రాష్ట్రంలో అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్
- పర్యావరణహిత వేడుకలకు ప్రాధాన్యం
- రక్షణ, పారిశుద్ధ్యం, వైద్యసేవలు నిరంతరం అందుబాటులో వుండాలి
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

3

## ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాం

- వెయ్యి రోజుల పాలనపై రవాణా శాఖ మంత్రి పొన్నం

3

## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

- సింగిల్ బెంచ్ తీర్పుపై హైకోర్టు స్టే



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..



2

## కాంగ్రెస్ దాడి సంస్కృతిపై ‘సడక్ సే సదన్ తక్’ పోరు

- రాచందర్ రావుతో నితిన్ నబీన్ ఫోన్ సంభాషణ

## నర్సు శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

- బాధిత కుటుంబానికి మంత్రి సీతక్క పరామర్శ



**కొత్తగూడెం, సెప్టెంబర్ 1:**

తుక్కుగూడలో దారుణ హత్యాచారానికి గురైన నర్సు ఉకే శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణలో వర్షా ల లోటు

- మూడు నెలల్లో 20 శాతం తక్కువ వర్షపాతం
- ఆగస్టులో ఏకంగా 42 శాతం లోటు

2

## మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల
- లబ్ధిదారులకు మహిళా యోజన చెక్కుల పంపిణీ



2



2

## ‘శుద్ధీకరణ’ పేరిట దళిత ఆత్మగౌరవంపై దాడి

- ఉత్తరాఖండ్ ఘటనపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం

## యాదాద్రి పవర్ స్టేషన్‌కు సైనీ బొగ్గు తొలి రేక్

3



## అంతుచిక్కని కాంగ్రెస్
# పార్టీ పరిణామాలు

**మొదటిపేజీ తరువాయి**

అంశాలు భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. సురేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై అధిష్ఠానం స్థాయిలో కసరత్తు కొనసాగుతున్నట్లు సమాచారం. సురేఖకు కూడా కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ లభించినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

**చిన్నారెడ్డి అంశంపైనా**

పార్టీ సీనియర్ నేత, ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారం కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనపై వచ్చిన ఆరోపణలు, పార్టీకి ఇబ్బందికరంగా మారిన పరిణామాల నేపథ్యంలో క్రమశిక్షణా చర్యలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సురేఖతో పాటు చిన్నారెడ్డి విషయంలోనూ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

**రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ మంత్రాంగం**

ఇదే సమయంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఢిల్లీకి చేరుకోవడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తనకు అవకాశం కల్పించాలని అధిష్ఠాన పెద్దలను కోరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే పలువురు ఆశావహులు అధిష్ఠానం పెద్దలను కలిసేందుకు ఢిల్లీ బాట పట్టినట్లు సమాచారం.

**తదుపరి నిర్ణయాలపై ఉత్కంఠ**

ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, కొండా సురేఖ, రాజగోపాల్ రెడ్డి సహా పలువురు కీలక నేతలు ఢిల్లీలో ఉండటం తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులపై ఊహాగానాలకు తెరతీసింది. సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలతో పాటు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలపైనే ఇప్పుడు పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## 'ఫీజు' బకాయిలు తక్షణం
# విడుదల చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ప్రస్తుతం 650కి పడిపోయిందని, ఇప్పటికే సుమారు 310 కళాశాలలు మూతపడ్డాయని తెలిపారు. అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బందికి 5 నుంచి 10 నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమను కలసి వినతిపత్రం అందజేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు, కరోనా కష్టకాలంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదని, తొమ్మిదిన్నరేళ్లలో రూ.19,500 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు.

**అసెంబ్లీని స్తంభింపజేస్తాం**

ఎలక్షన్ మేనిఫెస్టోలో పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని చెప్పి మూడు బడ్జెట్లు మారినా ఇప్పటికీ దాదాపు రూ.10,000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ప్రతీ విద్యాసంవత్సరం నిర్ణీత గడువులోగా నిధులు విడుదల చేసేలా శాశ్వత విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తామని హరీష్‌రావు హెచ్చరించారు.

## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

**మొదటిపేజీ తరువాయి**

2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాక పథకం లబ్ధిదారు కూడా కాదని అన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమని చెప్పారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందని అన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## 'శుద్ధీకరణ' పేరిట దళిత
# ఆత్మగౌరవంపై దాడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడం కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన ఘోర దాడి అని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఖర్గే ప్రసంగించిన వేదికపై శ్రీరామ్ సేన సభ్యులు 'శుద్ధీకరణ' నిర్వహించడాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఉత్తమ్ మండిపడ్డారు. తప్పు చేసిన వారిని పక్కన పెట్టి సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది కాంగ్రెస్‌బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగ సమానత్వానికి, సామాజిక వివక్షకు మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంగ్రామమని మంత్రి అభివర్ణించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రతిపక్షాలను భయపెట్టేందుకు వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా వాడుతున్నారని ఆరోపించారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. వేదికలను కాదు, సమాజంలో ఇంకా మిగిలి ఉన్న వివక్షాపూరిత మనస్తత్వాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



# తెలంగాణలో వర్షాల లోటు

- మూడు నెలల్లో 20 శాతం తక్కువ వర్షపాతం
- ఆగస్టులో ఏకంగా 42 శాతం లోటు
- 19 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సెప్టెంబర్‌పైనే రైతుల ఆశలు
- ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

తెలంగాణలో ఈ ఏడాది వర్షాకాలం ఆశించిన స్థాయిలో సాగడం లేదు. జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సాధారణంగా 581 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 462 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో సుమారు 20 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వర్షాల కొరతతో సాగు, తాగునీరు, భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఆగస్టులో భారీ లోటు**

నెలల వారీగా చూస్తే జూన్‌లో సాధారణం కంటే 8 శాతం, జూలైలో 10 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఆగస్టులో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఆ నెలలో ఏకంగా 42 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**19 జిల్లాల్లో లోటు**

రాష్ట్రంలోని జిల్లాల వారీ పరిస్థితిని పరిశీలిస్తే 13 జిల్లాల్లో మాత్రమే సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. మరో 19 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కామారెడ్డి జిల్లాలో మాత్రం సాధారణం కంటే 25 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో వర్షాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.

**సెప్టెంబర్‌పైనే ఆశలు**

వర్షాకాలంలో చివరి నెల అయిన సెప్టెంబర్‌పైనే రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని వాతావరణ అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 శాతం వరకు వర్షపాతం లోటు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఎండల ప్రభావం కూడా**

మరోవైపు వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా సెప్టెంబర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా. దీంతో సెప్టెంబర్‌లోనూ ఎండ తీవ్రత కొనసాగే పరిస్థితులు కనిపించవచ్చని పేర్కొంటున్నారు.

**వాతావరణ వ్యవస్థలపైనే ఆధారం**

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటడం, ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం కావడం వంటి పరిణామాలు వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా ఇతర వాతావరణ వ్యవస్థలు ఏర్పడితే తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సెప్టెంబర్‌లో వర్షాల పరిస్థితి రానున్న రోజుల్లో ఏర్పడే వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**



క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండకూడదని, మొత్తం విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ భాగస్వామ్యానికి సంబంధించిన కార్యాచరణను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి వేదికగా మలచాలని చెప్పారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం చేయడం ద్వారా ఖనిజాల అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే విధానాలపై దృష్టిపెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, మోనాష్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ యాయిన్నిస్ వెంటికోస్, ఆస్ట్రేలియాఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ మోహన్ ఎల్లిషెట్టి, ప్రొఫెసర్ రామన్ సింగ్, సింగరేణి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ దాడి సంస్కృతిపై 'సడక్ సే సదన్ తక్' పోరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

తెలంగాణలో బీజేపీ నేతలు, కార్యాలయాలపై జరుగుతున్న దాడుల ఘటనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆయన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగడుతున్నందుకే ఓర్వలేక పార్టీపై దాడులకు తెగబడుతున్నారని రామచందర్ రావు వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంతోపాటు నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడుల వివరాలను నబీన్‌కు తెలియజేశారు. బాధితుడు వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తుంటే తనను హౌజ్ అరెస్ట్ చేసి అనంతరం గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన తీరును వివరించారు. ఘటనల వివరాలు తెలుసుకున్న నితిన్ నబీన్‌రాష్ట్రంలో బీజేపీ శ్రేణుల ధైర్యాన్ని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న రాష్ట్ర నాయకత్వానికి, కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ దాడులకు భయపడేది లేదని, 'సడక్ సే సదన్ తక్' (రోడ్డు నుండి అసెంబ్లీ వరకు) పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, దాడికి గురైన నాగం వర్షిత్ రెడ్డితో కూడా నబీన్ త్వరలోనే ఫోన్ ద్వారా మాట్లాడి పరామర్శించనున్నారు.

# నర్సు శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

**మొదటిపేజీ తరువాయి**



(సీతక్క) హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి వెళ్లిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయితో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష**

ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్వయంగా వచ్చినట్లు మంత్రి సీతక్క తెలిపారు. నిందితుడిని పోలీసులు వేగంగా అరెస్టు చేశారని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద ఆదివాసీ కుటుంబానికి చెందిన శిరీష నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న సమయంలో ఇలాంటి దారుణం జరగడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆర్థిక సాయం, పునరావాస హామీలు**

బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా రూ.5 లక్షల చెక్కుతోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి రూ.లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక తాను, ఎమ్మెల్యే ఆదినారాయణ కలిసి వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశామన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద పరిహారంతోపాటు ఇందిరమ్మ ఇల్లు, సాగుభూమి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నగరాలకు వచ్చే గ్రామీణ, ఆదివాసీ యువతుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని, అత్యవసర సాయం కోసం ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటునూ పరిశీలిస్తామని వెల్లడించారు.

# మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల
- లబ్ధిదారులకు మహిళా యోజన చెక్కుల పంపిణీ

**మేడ్చల్, సెప్టెంబర్ 1 :**

మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడేందుకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా పొందే ఆర్థిక సహాయం ఎంతగానో దోహదపడుతుందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే ముఖ్యమంత్రి ఆలోచనే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన అని తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగగలరన్నారు. ఈ పథకం కింద మేడ్చల్ జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అందించారు. తుర్క కాశి ముస్లిం వర్గానికి కుల వృత్తికి ఉపయోగపడే రూ.60 వేల విలువ చేసే జనరేటర్ టూల్ కిట్‌లను 57మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రేవంత్ అన్నాకా సహారామిస్కినో కేలియే పథకం కింద మైనారిటీల జీవనోపాధికి అవసరమైన రూ.లక్ష విలువైన మోపెడ్‌లను, స్వయం ఉపాది కింద మహిళలకు కుట్టు మిషన్ లు అందజేశారు. మత, సామాజిక, మౌలిక సదుపాయాల కోసం ఆర్థిక సహాయం, విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించడానికి ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నదని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిష్ఠాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసి అందరికీ సన్న బియ్యం అందచేస్తున్నదన్నారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా నైపుణ్యం అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. అనంతరం లబ్దిదారులకు చెక్కుల పంపిణీ, జనరేటర్ అండ్ టూల్ కిట్ అందచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టీయే సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్స్, టీజీఎల్‌డీఏ చైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిలు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాం

- **కారుణ్య నియామకాలు జరిపాం**
- **వాహన్ సారథి తీసుకొచ్చాం**
- **వెయ్యి రోజుల పాలనపై రవాణా శాఖ మంత్రి పొన్నం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టామని, తమ ప్రభుత్వం వచ్చిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించామని, ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయగా వారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంతోపాటు సంస్థ ప్రగతిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా బస్ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ, రవాణా శాఖ విజయాలు, ప్రగతి గురించి వివరించారు. దేశంలో మొదటిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులను చేశామన్నారు. ప్రతి బస్సుకు రూ.69,468లు, నెలకు రూ.4 కోట్లు ఈఎంఐ చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు రూ.29.31 కోట్లు చెల్లించామని చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ 67 శాతం ఉంటే ఇప్పుడు 89 శాతం పెరిగిందన్నారు.

**ఈవీ బస్సులు, నియామకాలు**

సర్వీసు నుండి తొలగింపునకు గురైన దాదాపు 244మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నామని, 1,424 కారుణ్య నియామకాలు చేపట్టామని చెప్పారు. 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, పీఎం డ్రైవ్ కింద హైదరాబాద్‌లో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కబోతున్నాయని చెప్పారు. ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ వరకు కనెక్టివిటీ అమలు చేస్తామన్నారు. ఎలక్ట్రానిక్ టిమ్‌ల ద్వారా టికెట్ జారీ చేస్తున్నామన్నారు. తార్నాక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి చేశామని, ఆర్టీసీ శ్రామికులకు రెండు పీఆర్సీలు ఇచ్చామని, 5 డీఏలు ఇచ్చామని, డీఏలు పెండింగ్‌లో లేవని వివరించారు. యూనియన్ ఎన్నికలు జరుపుతున్నామని, తరువాత విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. బస్ స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని, పెద్దపల్లి, ఏటూరునాగారం డిపోలు ఇచ్చామని, సీసీఎస్ బకాయిలు రూ.1096 కోట్ల నుండి రూ.939 కోట్లకు తగ్గించామని, పీఎఫ్ బకాయిలు రూ.2108 కోట్ల నుండి రూ.1710 కోట్లకు తగ్గించామని, ఎసఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు రూ.513 కోట్ల నుండి రూ.485 కోట్లకు తగ్గించినట్లు వివరించారు. 4,538 ఉద్యోగాలకు నోటిఫికేషన్



ఇచ్చామని, వెయ్యి డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామకాలు పూర్తయ్యాయని, వచ్చే నెలలో నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. 1500 కండక్టర్ నియామకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఎక్కడా పొరపాటు జరగకుండా పారదర్శకంగా పోలీస్ శాఖ ద్వారా నియామకాలు చేపట్టామని చెప్పారు. 240 డీజిల్ బస్సులు రిట్రైర్ఫిట్మెంట్ చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలకు బస్ స్టేషన్లు ఆధునికీకరిస్తున్నామని, భక్తుల రద్దీకి తగ్గట్టు బస్సులు నడుపుతామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కొత్త రూట్లు అడిగితే బస్సులు వేస్తున్నామని, హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో నడిపిస్తున్నామని, గ్రామాల్లో కూడా బస్ రూట్లు లేని ప్రాంతాల్లో బస్సులు నడిపిస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు. దేశంలో నంబర్ 1గా ఆర్టీసీ ఎదుగుతుందన్నారు. ప్రతి నెలా మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, వారి సమస్యలు పరిష్కరిస్తున్నామని, రోడ్ సేఫ్టీ సెస్ రోడ్డు భద్రతకు ఉపయోగించుకునేలా చట్టం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు. నగరంలో కొన్ని రూట్లలో నైట్ బస్సులు నడుస్తున్నాయని మంత్రి పొన్నం చెప్పారు.

**ఈవీ పాలసీ**

హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తెచ్చామని, రూ.1400 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చామని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో ఆటోలను రిట్రైర్ఫిట్మెంట్ చేయడానికి ప్రభుత్వం రూ.1.50 లక్షలు సహాయం అందిస్తుందన్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టులు ఎత్తివేసిందని, జిల్లాలో ఎన్‌ఫోర్సుమెంట్ టీంలు పెంచామని, టీఎస్‌ను టీజీగా మార్చుకున్నామని చెప్పారు. వాహన అండ్ సారథి తీసుకొచ్చామని, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనలతో వాహన సారథిలో చేరామన్నారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టులు ప్రారంభిస్తున్నామన్నారు. రవాణా శాఖలో 113 ఏఎంవీఐలు, 50 మంది కానిస్టేబుల్, 20 మంది జూనియర్ అసిస్టెంట్, నలుగురు ఎంవీఐలను నియమించామని, రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అరైవ్ అలైవ్ పేరుతో పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని, రహవీర్ స్కీమ్ అమలు చేస్తున్నామని వివరించారు.

# గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తామని రవాణా బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. వచ్చే గణేష్ నవరాత్రి ఉత్సవాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఘనంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో గణేష్ ఉత్సవ వేడుకలు2026 ఉన్నతస్థాయి సన్నాహక సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని, మండపాల నిర్వాహకులు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకుని ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో సుమారు 47 సంవత్సరాలుగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాల సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని గత అనుభవాల్లో ఎదురైన సమస్యలు, లోపాలను ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఉత్సవాలు, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. షీ టీమ్స్, యాంటీథెఫ్ట్ నిఘా బృందాలను వినియోగించడంతోపాటు శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపులు, ట్రాఫిక్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖలు 24 గంటలపాటు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, వీధి దీపాలను సక్రమంగా నిర్వహించాలని, బేబీ పాండ్ల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఫాగింగ్, బయో టాయిలెట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన మున్సిపల్ కార్పొరేషన్ల లోగోలను విస్తృతంగా ప్రదర్శించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కీలక ప్రాంతాల్లో 24 గంటల వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతోపాటు ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, అంబులెన్సులు, షిఫ్ట్‌ల వారీగా వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మౌలిక వసతులను ముందస్తుగా తనిఖీ చేసి విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుని, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

రవాణా శాఖ, టీజీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న బస్సులను మాత్రమే వినియోగించాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా దాదాపు 700 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని అవసరమైన మార్గ మళ్లింపులు చేపట్టాలని, మొబైల్ బ్రేక్‌డౌన్ రిలీఫ్ వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో రైల్ సేవలను అవసరానికి అనుగుణంగా పొడిగించాలని, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలని, ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించాలని, స్టేషన్లలో స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు నిమజ్జన ప్రాంతాల్లో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాల్లో లైఫ్‌బోట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ బేబీ పాండ్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నాణ్యతను, ఇతర అవసరమైన ఏర్పాట్లను నిర్ధారించాలని ఆదేశించారు. ఎండోమెంట్స్, సాంస్కృతిక, సమాచార పౌర సంబంధాల శాఖలు మట్టి విగ్రహాలు, గణేష్ ఉత్సవాల ప్రచురణలు చేపట్టి ప్రజలలో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సాంస్కృతిక బృందాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని, ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని మంత్రి సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు డీజేల వినియోగంపై ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, శాంతిభద్రతలు, ప్రజా భద్రత, మత సామరస్యాన్ని కాపాడేందుకు అధికారులు, నిర్వాహకులకు పరస్పర సహకారం అలాగే అందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన సమన్వయం, సకాలంలో సమస్యల పరిష్కారంతో గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించా రు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, రఘువీర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి; డీజీపీ సీవీ ఆనంద్, ఏడీజీపీ మహేష్ భగవత్, పోలీస్ కమిషనర్లు సజ్జనార్, రమేష్, సుమతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్లు కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి; హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంతరావు, ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టూరిజం ఎండీ గౌతమి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జాయింట్ ఎండీ మయాంక్ మిట్టల్, సాంస్కృతిక శాఖ సంచాలకులు నరసింహారెడ్డి, ఐ&పీఆర్ అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటరమణ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి కార్యదర్శి శశిధర్ రెడ్డి, సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యాదాద్రి పవర్ స్టేషన్‌కు
# నైనీ బొగ్గు తొలి రేక్

**దామరచర్ల, సెప్టెంబర్ 1:**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) విద్యుత్ ఉత్పత్తి దిశగా ఒక కీలక మైలురాయిని అధిగమించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలో నడుస్తున్న ఒడిశాలోని నైనీ గని నుండి సేకరించిన అత్యంత నాణ్యమైన 4,000 టన్నుల బొగ్గుతో కూడిన మొదటి రైల్వే రేక్ మంగళవారం ప్లాంట్‌కు చేరుకుంది. ఈ తొలి బొగ్గు రేక్‌కు టీజీజెన్‌కో డైరెక్టర్లు బి.నాగ్య (బొగ్గు & లాజిస్టిక్స్), వై.రాజశేఖర్ రెడ్డి (థర్మల్ & ప్రాజెక్ట్స్) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ నుండి సుమారు 1,050 కిలోమీటర్ల దూరం రవాణా అయిన ఈ అధిక నాణ్యత గల బొగ్గు వల్ల బాయిలర్ల పనితీరు మెరుగవడమే కాక బూడిద సమస్యలు తగ్గి ప్లాంట్ గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవతో టీజీజెన్‌కో, సింగరేణి, రైల్వేల సమన్వయంతో ఈ సుదూర రవాణా ప్రక్రియ సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరగడం వల్ల రాష్ట్రానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని స్పష్టం చేశారు.

## ఎంపీ ల్యాడ్స్ నిధులపై
# దుష్ప్రచారం తగదు

- **ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు**
- **ఎంపవర్డ్' సంస్థ నివేదికపై కేంద్ర మంత్రి బండి**

**కరీంనగర్, సెప్టెంబర్ 1 :**



ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై ఆయన స్పందించారు. కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంటు సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని అన్నారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా అభాండాలు వేయడం సరికాదన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని సంజ□YT స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో వి□డియాకు వివరించారు. 'కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించి గత మ□డేళ్లలో కమ□్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం.. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి.. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా కలెక్టర్లు ఆమోదం తెలిపారు.. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది.. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు తెలిపారు. వాస్తవానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదంటూ ఆ నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ 'ఎంపవర్డ' సంస్థ ప్రచారం చేయడం అన్యాయమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో ఏడు నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఆ నిధులు మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ సంబంధిత కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాల న్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని వాటిని ప్రజల ముందుంచాలని సంజయ్ కోరారు.

## బీజేపీ నేతల అరెస్టులు
# అప్రజాస్వామికం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:**



కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామిక, నియంతృత్వ పాలన సాగిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నల్లగొండలో దాడికి గురైన బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు మరియు ఇతర సీనియర్ నాయకులను హౌజ్ అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల తరపున ప్రశ్నిస్తున్న బీజేపీని చూసి భయపడుతోందని కిషన్ రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడి నివాసంపైనా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపైనా దాడులు చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోకుండా బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఎంతమందిని అరెస్ట్ చేసినా ప్రజల సమస్యలపై, బాధితుల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగుతుందని, కాంగ్రెస్ అహంకార పూరిత వైఖరికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా వంచనే

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్ర ధ్వజం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకున్న వెయ్యి రోజుల పాలన ప్రజా పాలన కాదని, అది ముమ్మాటికీ ప్రజా వంచన పాలన అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడుల నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు వెళ్తుంటే మంగళవారం హౌజ్ అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను, గ్యారెంటీలను విస్మరించి రాష్ట్ర ప్రజలను దయనీయ స్థితిలోకి నెట్టారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఈ రోజుల వెయ్యి పాలన ప్రజలకు ఏమి ఇచ్చిందో పరిశీలిస్తే నేడు తెలంగాణ అత్యంత ఆందోళనకరమైన, దయనీయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది అన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు, గ్యారెంటీలలో ఇప్పటివరకు అమలైనవి ఎన్ని.. నెరవేర్చిన హామీలు ఏవి అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**రైతులు, నిరుద్యోగులకు ద్రోహం**

రుణమాఫీకి ₹40,000 కోట్లు అవసరమైతే కేవలం ₹18,000 కోట్లతో చేతులు దులుపుకున్నారని, రైతు భరోసాను ₹15,000 నుంచి ₹12,000 కు తగ్గించి బకాయిలు పెట్టారని మండిపడ్డారు. కౌలు రైతుల సమస్యలు పట్టించుకోలేదని, ₹500 ధాన్యం బోనస్ హామీ అమల్లోకి రాలేదని పేర్కొన్నారు. మొదటి 100 రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,000 ఉద్యోగాలతో యువతను మోసం చేశారని రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యోగులు, విద్యార్థుల రోదన**

ఉచిత స్కూటర్లు, మహిళలకు ₹2,500 సాయం, పసిడి హామీలు ఎటు పోయాయని ప్రశ్నించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పెన్షన్లు ఇవ్వకపోగా, పీఆర్సీ అమలును నిర్లక్ష్యం చేశారన్నారు. సుమారు ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**డిక్లరేషన్ల పేరుతో మోసం**

బీసీ సంక్షేమం అన్నారు, ఎస్సీ డిక్లరేషన్ అన్నారు, రైతు డిక్లరేషన్ అన్నారు.. సమాజంలోని అన్ని వర్గాలకు కొండంత ఆశలు చూపించారు. ఆ డిక్లరేషన్లు, కమిట్‌మెంట్లు ఇప్పుడు ఎక్కడికి పోయాయని నిలదీశారు.



ఈ 1,000 రోజుల్లో ప్రజలకు మీరు చెప్పింది 1,000 అబద్ధాలు మాత్రమే. ఇది ప్రజా పాలనః కాదు.. ముమ్మాటికీ ప్రజా వంచన పాలన అని అన్నారు.

**హైదరాబాద్‌పై కొత్త భారాలు – శాంతిభద్రతలు కుదేలు**

నగర ప్రజలను భయాందోళనలకు గురిచేయడానికి హైడ్రా, అనిశ్చితికి హిల్ట్, కొత్త పన్నుల వసూళ్లకు క్యూర్ తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఎమర్జెన్సీ వాతావరణాన్ని గుర్తు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే నాణేనికి రెండు ముఖాలని అభివర్ణించిన ఆయన తమపై అక్రమ కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా, అరెస్టులు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ దాడుల సంస్కృతికి భిన్నంగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని, ప్రజలను ఏకం చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ నిరంతరం పోరాటం సాగిస్తుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు.

# కొత్తగూడెం విమానాశ్రయంపై కీలక ముందడుగు

- 7న రానున్న కేంద్ర సాంకేతిక బృందం

**న్యూదిల్లీ:**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన 4 నుంచి 5 ప్రత్యామ్నాయ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం ఈనెల 7న పర్యటించనుంది. దిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మంగళవారం భేటీ అయిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వివరాలను వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేకపోవడంతో కొత్తగా మరికొన్ని స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, విమానాశ్రయ నిర్మాణ సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం పరిశీలించనుంది. సాంకేతిక నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. భద్రాచలం రామాలయ విశిష్టతను, జిల్లా ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించిన కేంద్ర మంత్రికి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. అలాగే, వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# జీడీపీ వృద్ధి రేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే వృద్ధి ఎలా సాధ్యం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూదిల్లీ, సెప్టెంబర్ 1 :**



దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతోందని ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజి' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని రమేష్ ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కి, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650కి చేరిందని వెల్లడించారు. వెయ్యి చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెరిగిందని తెలిపారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికుల ఖర్చు ఇలా అన్నీ పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగునపరిచి గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదన్నారు. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



# భారత్‌కు మరిన్ని ఎస్-400 క్షిపణులు


- రష్యాతో ఒప్పందం కుదుర్చుకోనున్న ఇండియా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**

ఆపరేషన్ సిందూర్‌లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలను భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని రక్షణ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్`400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈమేరకు ఐదు కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో విజయవంతంగా పనిచేసింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. వీటి పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాక్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ దూరంలో ఎస్400 కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్400 అనేది ఒకే మిసైల్ కాదు.. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం భారత్ మొత్తం ఐదు ఎస్400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు నాలుగు యూనిట్లు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో ఐదు యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**



భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్` జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని, అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని సూచించారు.. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచించారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వీడియో విడుదల చేశారు. 'దేశ ప్రజలకు అభినందనలు.. 7.8 శాతం వృద్ధి గొప్ప విషయం.. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం.. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది.. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది.. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే.. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది.. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు.. అయినా భారత్ పురోగమిస్తోంద'ని ఆ వీడియోలో పేర్కొన్నారు. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉంది' అని మోదీ పేర్కొన్నారు.

# ఆగస్టులో జీఎస్టీ వసూళ్ల జోరు

- గతేడాదితో పోల్చితే 14.8 శాతం అధికం
- తాత్కాలిక గణాంకాలు విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**

దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతున్నదనడానికి సంకేతంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకంగా నమోదయ్యాయి. ఆగస్టు నెలకు జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,99,853 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 14.8 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతులపై పన్నుల వసూళ్లు గణనీయంగా పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక గణాంకాలను మంగళవారం విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.1,74,116 కోట్లుగా ఉండగా ఈసారి దాదాపు రూ.2 లక్షల కోట్ల మార్కుకు చేరువయ్యాయి. ఈ ఏడాది జులైలో నమోదైన రూ.2.11 లక్షల కోట్లతో పోలిస్తే ఆగస్టు వసూళ్లు కొంత తక్కువగా ఉన్నాయి. ఈ వృద్ధిలో దిగుమతుల నుంచి వచ్చిన జీఎస్టీ కీలక పాత్ర పోషించింది. దిగుమతులపై స్థూల జీఎస్టీ ఆదాయం ఏకంగా 29 శాతం పెరిగి రూ.62,604 కోట్లకు చేరింది. మరోవైపు, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ కూడా 9.3 శాతం వృద్ధితో రూ.1,37,249 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఆగస్టులో ప్రభుత్వం చెల్లించిన రిఫండ్‌లు కూడా భారీగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రిఫండ్‌లు 67.9 శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. దీంతో రిఫండ్‌లను మినహాయించిన తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1,68,057 కోట్లుగా ఉంది. ఇది గతేడాది నికర ఆదాయంతో పోలిస్తే 8.3 శాతం మాత్రమే ఎక్కువ. నికర వసూళ్లను విశ్లేషిస్తే కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.49,299 కోట్లకు చేరగా, దేశీయ నికర జీఎస్టీ వసూళ్ల వృద్ధి మాత్రం కేవలం 3.4 శాతానికే పరిమితమై రూ.1,18,759 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిఫండ్‌లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ గణాంకాలు వెలువడిన నేపథ్యంలో ఈనెల 12న దిల్లీలో 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి ఒకరోజు ముందు అధికారులస్థాయి సమావేశం కూడా జరగనున్నట్లు జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది.

# నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్ ఎత్తివేత

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**



నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్ లను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడించింది. ఢిల్లీ, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కోర్టు కొట్టివేసింది. ఢిల్లీ పరిధిలో జంతర్ మంతర్ వద్ద జూలై 2025 వరకు జరిగిన నిరసనలపై 13 ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. అయితే ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి కేసులు ఉండవు. కానీ, గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు కొనసాగుతాయి. అలా 2,873 మందిపై నమోదైన ఎఫ్ ఐఆర్ లు మాత్రం కొనసాగుతాయని కోర్టు తెలిపింది. నీట్ ఆందోళనలపై అన్ని రాష్ట్రాల్లో నమోదైన కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. పరిహారం అందించేందుకు మూడు నెలల్లో విధివిధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం తెలిపినట్టు కోర్టు పేర్కొంది.

# సెప్టెంబర్ 5 నిరసన రద్దు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:**

కాక్రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన నిరసన మార్చ్‌ను రద్దు చేసింది. ఢిల్లీతో పాటు బీజేపీ పాలిత నాలుగు రాష్ట్రాల్లో నీట్ ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని, ఇకపై కొత్త కేసులు నమోదు చేయబోమని కేంద్రం సుప్రీంకోర్టుకు హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ విషయాన్ని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఢిల్లీ పోలీసులు, బీజేపీ పాలిత రాష్ట్రాల వైఖరిని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 5 నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.

**కేంద్రం కీలక హామీలు**

ఢిల్లీ, బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అసోం పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు పలు హామీలు ఇచ్చారు. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని, వాటిలో ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోమని తెలిపారు. నిరసనలకు సంబంధించి ఇకపై కొత్తగా ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. నిరసనకారులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని, అనంతరం పలు అంశాలపై అవగాహన కుదిరిందని చెప్పారు.

**ఆర్టికల్ 142తో ఎఫ్ఐఆర్‌ల రద్దు**

ఈ నేపథ్యంలో సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ పోలీసులు ఆందోళనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కొట్టివేయాలని సొలిసిటర్ జనరల్ కోర్టును కోరారు. పూర్తి న్యాయం చేసేందుకు ఆర్టికల్ 142ను వినియోగిస్తూ నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై నమోదైన కేసులు కొనసాగుతాయని పేర్కొంది.

**సెప్టెంబర్ 5 నిరసనకు పిలుపు**

జూలై 25న కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలో దేశవ్యాప్త నిరసన మార్చ్‌కు పిలుపునిచ్చింది. జూలై 25 తర్వాత దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలను ఉపసంహరించుకున్నప్పటికీ, కేంద్రం హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ మరోసారి ఆందోళనకు సిద్ధమైంది. సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకున్నారు. తాజాగా కేంద్రం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీల నేపథ్యంలో నిరసనను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**మృతుల కుటుంబాలకు పరిహారం**

నీట్ పేపర్ లీక్ తర్వాత ఆత్మహత్యలకు పాల్పడి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే హామీకి కేంద్రం కట్టుబడి ఉందని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే పరిహారం చెల్లింపునకు సంబంధించిన విధివిధానాలను ఇంకా ఖరారు చేయాల్సి ఉందన్నారు. పలు రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నందున పరిహారం సాధారణ నిబంధనగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వివరించారు.

**మూడు నెలల్లో విధివిధానాలు**

రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో చర్చించి పరిహార పథకాన్ని ఖరారు చేసేందుకు మూడు నెలల సమయం అవసరమని కేంద్రం కోర్టుకు తెలిపింది. విధివిధానాలు ఖరారైన వెంటనే పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యల కేసుల్లో వారి కుటుంబాలకు పరిహారం అందించే విధివిధానాలను మూడు నెలల్లో ఖరారు చేసి, అనంతరం చెల్లింపులు చేపట్టాలని సీజేఐ సూర్యకాంత్ సూచించారు.

# ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదు

- పాక్ ప్రధాని సమక్షంలో మోదీ కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదానికి ఆశ్రయం, మద్దతుపై గట్టి సందేశం
- ఉగ్రవాద వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని పిలుపు
- ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదని స్పష్టీకరణ
- సార్వభౌమత్వాన్ని గౌరవించేలా మౌలిక వసతుల ప్రాజెక్టులు

**బిష్కెక్, సెప్టెంబర్ 1:**



కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోదీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. "ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు" అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు**

ఎస్‌సీఓ దేశాధినేతలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలపై అంతర్జాతీయ సమాజం గట్టి హెచ్చరిక చేయాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్ని దేశాలు ఒకే గొంతుతో స్పష్టం చేయాలని పిలుపునిచ్చారు.

**ఉగ్రవాద వ్యవస్థను నిర్మూలించాలి**

ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అంశాలపై దేశాలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. 2025లో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే.

**సార్వభౌమత్వానికి గౌరవం**

మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోదీ అన్నారు. అయితే అలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు.

**అగ్రనేతల హాజరు**

బిష్కెక్‌లో జరిగిన సమావేశానికి మోదీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్‌జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మోన్ తదితరులు హాజరయ్యారు.

**2001లో ఏర్పడిన ఎస్‌సీఓ**

పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకర సహకారాన్ని ప్రోత్సహించడం ఎస్‌సీఓ ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి.

# మెడికల్ బోర్డుల సంఖ్య పెంచాలి



- మెడికల్ ఇన్వాలిడేషన్‌లో జాప్యంపై టీబీజీకేఎస్ నిరసన
- అర్హులైన కార్మికుల కేసులు త్వరగా పరిష్కరించాలని డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల ఆందోళన
- గని మేనేజర్‌కు మెమోరాండం అందజేత

**శెనార్తి మీడియా, గోదావరిఖని:**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీబీజీకేఎస్ యూనియన్ పోరుబాట పట్టింది. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో కేవలం 10 శాతం మంది కార్మికులకు మాత్రమే మెడికల్ ఇన్వాలిడేషన్ కల్పించడాన్ని నిరసిస్తూ మంగళవారం కృషి భవన్ వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపట్టారు.

**బోర్డుల సంఖ్య పెంచాలి**

మెడికల్ ఇన్వాలిడేషన్‌కు అర్హత ఉన్నప్పటికీ తగిన సంఖ్యలో మెడికల్ బోర్డులు నిర్వహించకపోవడంతో పలువురు కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. నెలకు రెండు నుంచి మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి, అర్హత కలిగిన అధిక సంఖ్యలో కార్మికులకు ఇన్వాలిడేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

**పెండింగ్ కేసులు పరిష్కరించాలి**

ఈ మేరకు యూనియన్ నాయకులు గని మేనేజర్‌కు మెమోరాండం అందజేశారు. కార్మికుల సమస్యను యాజమాన్యం సానుకూలంగా పరిశీలించి, మెడికల్ బోర్డుల సంఖ్యను పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫిట్ సెక్రటరీ మామిడి తిరుపతి అధ్యక్షతన జరిగిన నిరసనలో టీబీజీకేఎస్ బ్రాంచ్ సెక్రటరీ హరిప్రసాద్, సెంట్రల్ కమిటీ నాయకులు అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, కూర తిరుపతి, రిలే బి-షిఫ్ట్ ఇన్‌చార్జి అక్కెనపల్లి సురేష్, కనకరాజు, కన్నె రవి, రమేష్, బియ్యాని శీను, మహిపతి, ముఖేష్, దామెర శ్రీనివాస్, పూర్ణచందర్, వంశీనాథ్, మంగళవారం సతీష్, రామ్మూర్తి, నరసింహులు, ముక్కెర మహేందర్, రాజేందర్ తదితరులతో పాటు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోతారంలో యాదవ సంఘం ఎన్నిక



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** మండలంలోని పోతారం గ్రామ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగిలి మల్లేశం, ఉపాధ్యక్షుడిగా చౌదరి కొమురయ్య ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన నాయకత్వంలో యాదవ సంఘం మరింత అభివృద్ధి సాధిస్తూ ఐక్యతకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బెజ్జంకి ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండల నూతన కమిటీ ఎన్నిక సమావేశం మండల ఇన్‌చార్జి చింతకింది పరశురాములు, మండల కన్వీనర్ వడ్లూరి పరశురాములు మాదిగ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి మాదిగ, జిల్లా కన్వీనర్ ముక్కపల్లి రాజు మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలు గా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటాలు నిర్వహించి ఎస్సీ వర్గీకరణ సాధించిందన్నారు. మాదిగలతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు కొనసాగిస్తూ పలు సంక్షేమ పథకాలను సాధించిందన్నారు. మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ సదస్సుకు నూతన డివిజన్ కమిటీ బాధ్యులు తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ బెజ్జంకి మండల అధ్యక్షుడిగా జేరిపోతుల మధు మాదిగ, అధికార ప్రతినిధిగా నల్గొండ చంద్రశేఖర్ మాదిగ ఎన్నికయ్యారు. ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా వడ్లూరి పరశురాములు మాదిగ, అధికార ప్రతినిధిగా జనగాం పోషయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పొత్తూరి మల్లేశం మాదిగ, ఉపాధ్యక్షుడిగా మాతంగి రవి మాదిగ, కార్యదర్శిగా బెజ్జంకి పోచయ్య మాదిగ ఎన్నికయ్యారు. సమావేశంలో బోనగిరి శ్రీనివాస్, మహంకాళి బాలయ్య, మోదుంపల్లి రాజు, తాడిశెట్టి భూమయ్య, లింగాల బాబు, నగ్నూర్ అంజయ్య, బెజ్జంకి శంకర్, బోనగిరి ఆనంద్, కొంపల్లి మల్లేశం, బొర్ర సురేష్, మంకాల రాజు, మాతంగి రవీందర్, బిగుళ్ల రాజు, కొమ్ము లక్ష్మణ్, జక్కుల బాబు, మహంకాళి శ్రీకాంత్, మంకాళి నగేష్, లింగాల శ్రీను, బర్ల ఇస్తరీ, ఉట్ల రామచంద్రం, గాజుల అనిల్, చిలుముల రాములు, బోనగిరి చంద్రం, బోనగిరి కొత్త, జేరిపోతుల రాజు, సునీల్, చిలుముల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు కలెక్టర్ ఆత్మీయ భరోసా

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. కలలు కనడంతో పాటు వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలని చెప్పారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను మంగళవారం సాయంత్రం కలెక్టర్ తనిఖీ చేశారు. కళాశాలలోని వంటశాలను పరిశీలించి విద్యార్థుల కోసం తయారు చేస్తున్న వంటకాలు, అన్నం నాణ్యతను పరిశీ లించారు. అనంతరం స్టోర్‌రూమ్‌ను సందర్శించి కూరగాయలు, పండ్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. కళాశాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, మెనూ, చదువు, యూనిఫాంలు, పుస్తకాలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను ఓపికగా విని భరోసా కల్పించారు. క్రమశిక్షణతో చదువుతూ మంచి మార్కులు సాధించాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, సిబ్బంది పాల్గొన్నారు



## వృద్ధులు, దివ్యాంగులకు మెరుగైన వసతులు





**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ వృద్ధులు, దివ్యాంగుల వసతిగృహాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. మంగళవారం సాయంత్రం వసతిగృహాన్ని సందర్శించిన కలెక్టర్ వృద్ధులు, దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆధునీకరణ పనులను పరిశీలించి, ఇప్పటికే మంజూరైన నిధులతో చేపట్టిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా వసతిగృహాన్ని ఆధునీకరించాలని, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపర్చాలని ఆదేశించారు. ఫేజ్-2 కింద మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అవసరమైన పనులకు ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతిని ఆదేశించారు. వసతిగృహం కేవలం నివాస ప్రదేశంగా కాకుండా వృద్ధులు, దివ్యాంగులకు ఆత్మీయత, భద్రత, సౌకర్యం కల్పించేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, వార్డెన్ రాధిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## నల్ల రిబ్బన్లతో ఉద్యోగుల నిరసన

**శెనార్తి మీడియా, కరీంనగర్/శంకరపట్నం:**

కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నల్ల రిబ్బన్లు ధరించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏల విడుదల, పీఆర్సీ కమిటీ నివేదిక ఆధారంగా ఆరు నెలల్లో కొత్త వేతనాల అమలు వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీతాలు భిక్ష కాదని, తాము పనిచేసినందుకు ప్రభుత్వం చెల్లిస్తున్న ప్రతిఫలమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారి బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నాలుగు నెలలుగా హెల్త్ కార్డుల కోసం ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ కట్ చేస్తున్నా కార్డులు ఇవ్వడం లేదని, పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ప్రభుత్వం చర్చలకు పిలిచి హామీలు ఇస్తున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పెరుక నాగమోహన్, ఆర్థిక కార్యదర్శి పి. రామచంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

డిమాండ్ల సాధన కోసం శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పీఆర్సీ అమలు, పెండింగ్ బకాయిల విడుదల, జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్ఐ రాములు, సీనియర్ అసిస్టెంట్ రజని, రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**శెనార్తి మీడియా, జగిత్యాల:** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ కందుకూరు రవిబాబు మాట్లాడుతూ పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, హెల్త్‌కార్డులను పటిష్ఠంగా అమలు చేయాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 10న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన



**శెనార్తి మీడియా, హుజురాబాద్:**

హుజురాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రారంభమైందని సీడీపీవో సుగుణ తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతితో పాటు వెరిఫికేషన్ సభ్యుల బృందం పారదర్శకంగా ఈ ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. మంగళవారం సైదాపూర్ మండలంలోని గొడిశాల-1, గొడిశాల-2, సైదాపూర్-1, సైదాపూర్-2, శాలపల్లి అంగన్వాడీ కేంద్రాల టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కుమ్మరివాడ, సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి-1, సర్వాయిపేట అంగన్వాడీ కేంద్రాల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు సీడీపీవో తెలిపారు.

## రసమయిపై విమర్శలు సహించం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బీఆర్ఎస్ మానకొండూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ యువజన కార్యనిర్వాహక అధ్యక్షుడు ఘనపురం తిరుపతి అన్నారు. బెజ్జంకి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ పరీక్షలకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సమీపంలోని మహాత్మానగర్‌లో డ్రగ్స్, గంజాయి లభించినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇథనాల్ ఫ్యాక్టరీతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పశువులు, చేపలు మృతి చెందడంతో పాటు నీరు కలుషితమవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని ఇథనాల్ యాజమాన్యానికి తాకట్టు పెట్టారని కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేశారు. పశువులు, వృక్షాలు, జంతు వులు మృతి చెందుతున్నా స్పందించడం లేదన్నారు. ఈ సమస్యలను పక్కన పెట్టి రసమయి బాలకిషన్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామంచ పరశురాములు, మాషం బాబు, కల్లూరి అజయ్ యాదవ్, మాంకాళి నగేష్, లింగాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రేకుర్తి బస్తీ దవాఖానలో డీఎంహెచ్‌వో తనిఖీ

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు రేకుర్తి బస్తీ దవాఖానను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. హాజరు, అవుట్‌పేషెంట్, ఎన్‌సీడీ రిజిస్టర్లతో పాటు ఫార్మసీ నిల్వలు, పిల్లల టీకాల నిల్వ కోసం వినియోగిస్తున్న ఐఎల్ఆర్, రోజువారీ ఉష్ణోగ్రత నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి ప్రతి వారం సమావేశమై జ్వర సర్వే, వైద్య శిబిరాలు, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహణపై చర్చించాలని సూచించారు. జ్వర నమూనాలను టీ-హబ్‌కు క్రమం తప్పకుండా పంపించాలని, వైద్య శిబిరాల తేదీలు, ప్రాంతాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాముకాటు, కుక్కకాటుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, సిబ్బంది సెలవులకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, అభా కార్డుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. 13 ఏళ్లకు పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళా శిబిరాల్లో నిర్వహించిన స్క్రీనింగ్‌పై పునఃపరీక్షలు, తదుపరి వైద్య పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్యతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# జీవనమే సందేశం.. బోయినపల్లి ప్రస్థానం

## నిలువెత్తు గాంధేయ జీవనం... బోయినపల్లి స్మరణం

### నేడు బోయినపల్లి వెంకట రామారావు జయంతి

సమాజ హితమే ఊపిరిగా.. ప్రజాసేవే పరమావధిగా.. సత్యం, అహింస, సమానత్వం, సామాజిక సంస్కరణలను జీవితాంతం ఆచరించిన మహోన్నత చైతన్యమూర్తి బోయినపల్లి వెంకట రామారావు. 'తోటపల్లి గాంధీ', 'కరీంనగర్ గాంధీ', 'తెలంగాణ గాంధీ'గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఆయన జీవితం ఓ వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు.. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, ఉద్యమ ప్రస్థానానికి నిలువెత్తు సాక్ష్యం. 1920 సెప్టెంబర్ 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా తోటపల్లి గ్రామంలో రంగమ్మ, కొండల్‌రావు దంపతులకు జన్మించిన వెంకట రామారావు.. 2014 అక్టోబర్ 27న 94వ ఏట కన్నుమూసే వరకు ప్రజాసేవే జీవితంగా గడిపారు. హైదరాబాద్ సంస్థాన విమోచన పోరాటం నుంచి గ్రంథాలయోద్యమం వరకు.. అస్పృశ్యతా నివారణ నుంచి భూదానోద్యమం వరకు.. ఖాదీ వికాసం నుంచి సాహిత్య, సాంస్కృతిక పునరుజ్జీవనం వరకు ఆయన అడుగుపెట్టని ప్రజాహిత రంగం లేదంటే అతిశయోక్తి కాదు. బాల్యంలోనే నిజాం పాలనలోని వెట్టిచాకిరీ, కుల వివక్ష, మూఢాచారాలు, మాతృభాషపై ఆంక్షలు వెంకట రామారావును కలచివేశాయి. ఆర్యసమాజ సంస్కరణ భావజాలం, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ఆయన ఆలోచనలకు పదును పెట్టాయి. పదహారేళ్ల ప్రాయంలోనే ప్రజాసేవకు అంకితమయ్యారు. 1935 డిసెంబర్ 29 నుంచి 1936 జనవరి 1 వరకు సిరిసిల్లలో జరిగిన నాలుగో ఆంధ్ర మహాసభలో స్వచ్ఛంద దళ నాయకుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్ర మహాసభను కేవలం సమావేశ వేదికగా కాకుండా ప్రజల్లో భాషా చైతన్యం, స్వేచ్ఛాకాంక్షను రగిలించే ఉద్యమ వేదికగా భావించారు. మూఢనమ్మకాలు, కుల జాడ్యాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్న కాలంలోనే వెంకట రామారావు సంస్కరణల బాట పట్టారు. 1940లో చిల్వాకోడూరు కేంద్రంగా మొదలుపెట్టి జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లో వితంతు పునర్వివాహాలకు ముందుండి సహకరించారు. ఛాందసవాదుల నుంచి బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. 1945 నాటికే దళితుల ఆలయ ప్రవేశానికి కృషి చేయడంతో పాటు వారితో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. అట్టడుగు వర్గాలకు ఆత్మగౌరవం, విద్యావకాశాలు కల్పించినప్పుడే స్వాతంత్ర్యానికి సార్థకత చేకూరుతుందని తన ఆచరణతో చాటిచెప్పారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ పిలుపుతో వెంకట రామారావు స్వాతంత్ర్య పోరాటంలో మరింత క్రియాశీలమయ్యారు. నిజాం పోలీసుల నిఘా, కుటుంబంపై ఒత్తిళ్లు ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. తండ్రి కొండల్‌రావును మాలీ పటేల్ పదవి నుంచి తొలగించి నిర్బంధించినా ఆయన వెరవలేదు. అజ్ఞాతంలో ఉంటూనే మెట్‌పల్లి ఖాదీ కేంద్రంపై నిజాం ఆంక్షలను ధిక్కరించి మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జమ్మికుంట రైల్వే మార్గానికి సంబంధించిన ఉద్యమ కేసులో అరెస్టై దాదాపు రెండేళ్లు కారాగార శిక్ష అనుభవించారు. 1945లో కాజీపేట సమీపంలో మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా దర్శించడం వెంకట రామారావు జీవితంలో కీలక ఘట్టం. గాంధీజీతో సంభాషణ అనంతరం ఆయన జీవన విధానం మరింత గాంధేయ మార్గంలోకి మళ్లింది. ఖాదీ ధారణ, నిరాడంబర జీవనం, మద్యపాన నిషేధం, అహింసాయుత పోరాటాన్ని జీవితాంతం పాటించారు. 1948 జనవరి 30న గాంధీజీ హత్య వార్త తెలిసినప్పుడు జైలులోనే సంతాప సభ నిర్వహించి బాపూజీకి నివాళులర్పించారు. గాంధీని కేవలం అభిమానించడమే కాదు.. ఆయన ఆశయాలను తన జీవితంలో ఆచరించి చూపారు. వెంకట రామారావు జీవితంలో గ్రంథాలయోద్యమానికి ప్రత్యేక స్థానం ఉంది. 'గ్రంథాలయం పుస్తకాల కొట్టు కాదు.. ప్రజా చైతన్య వికాసానికి ప్రయోగశాల' అని బలంగా విశ్వసించారు. 1939లో తన 19వ ఏటనే 'ఆంధ్ర విద్యాభివర్ధిని' గ్రంథాలయాన్ని స్థాపించారు. 1972 నుంచి 1978 వరకు కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సేవలందించారు. సుదీర్ఘకాలం పాలకమండలిలో కొనసాగుతూ ఊరూరా గ్రంథాలయాలు, సంచార పుస్తక కేంద్రాలు, వయోజన రాత్రి బడుల ఏర్పాటుకు కృషి చేశారు. 1976లో స్వయంగా స్థలం సమకూర్చి కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించేందుకు చొరవ చూపారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కోదాటి నారాయణరావు వంటి ప్రముఖులతో కలిసి పఠనోద్యమానికి ఊపిరిపోశారు. 1962లో 'కరీంనగర్ జిల్లా రచయితల సంఘం' స్థాపనలో కీలకపాత్ర పోషించిన వెంకట రామారావు.. అనంతరం 'సారస్వత జ్యోతి' సంస్థను ఏర్పాటు చేశారు. విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వేంకటావధాని, వానమామలై వరదాచార్యులు, పల్లా దుర్గయ్య, దాశరథి కృష్ణమాచార్య, సి.నారాయణరెడ్డి, గుంటూరు శేషేంద్రశర్మ, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. చరిత్ర పరిశోధకులు బీఎన్ శాస్త్రి, దూపాటి వేంకట రమణాచార్యులతో కలిసి శాతవాహనులు, కాకతీయుల కాలానికి చెందిన శాసనాలు, తాళపత్రాలు, పురాతన నాణేలు, ఇతర చారిత్రక ఆనవాళ్ల సేకరణకు కృషి చేశారు. స్వయంగా కవి అయిన ఆయన 'వెంకట రామారావు గేయాలు' వంటి రచనల ద్వారా ప్రజా చైతన్యాన్ని అక్షరబద్ధం చేశారు. సర్వోదయ ఆదర్శాలను జీవన విధానంగా మార్చుకున్న వెంకట రామారావు.. ఆచార్య వినోబా భావే, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌లతో కలిసి పర్యటించారు. భూదానోద్యమంలో తనకున్న ఏడు ఎకరాల సారవంతమైన భూమిని నిరుపేదలకు దానం చేసి.. 'చెప్పడం కాదు.. చేసి చూపడమే త్యాగం' అని నిరూపించారు. 1981లో 'ఖాదీ నవనిర్మాణ సమితి'ని నెలకొల్పి గ్రామీణ చేతివృత్తుల పరిరక్షణకు కృషి చేశారు. అఖిల భారత సర్వసేవా సంఘం సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి అధ్యక్షుడిగా, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రతినిధిగా గాంధేయ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమంలోనూ ఆయన ముందుండేవారు. వృద్ధాప్యంలోనూ తన సిద్ధాంతాల విషయంలో రాజీపడకుండా సత్యాగ్రహ దీక్షలకు దిగిన నిబద్ధత ఆయన సొంతం. ఆయన సేవలకు గుర్తింపుగా 'గ్రంథాలయ విభూషణ్', 'ఉపన్యాస కేసరి', 'హరిజన బంధు', 'విశ్వబంధు', 'అపర గాంధీ' వంటి బిరుదులు వరించాయి. 2005లో కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 2014 అక్టోబర్ 27న బోయినపల్లి వెంకట రామారావు భౌతికంగా దూరమైనా.. ఆయన వెలిగించిన అక్షరజ్యోతి, గాంధేయ నిబద్ధత, త్యాగనిరతి నేటికీ వెలుగులు పంచుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యమంటే పరాయి పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు.. అజ్ఞానం, అస్పృశ్యత, పేదరికం, అసమానతలు లేని సమాజ నిర్మాణమని తన జీవితంతో చాటిన బోయినపల్లి వెంకట రామారావు.. నిజంగానే 'జీవనమే సందేశం'గా నిలిచిన తెలంగాణ గాంధీ.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కల్పవృక్షం కలకాలం జీవనాధారం

### నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం



ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తారు. జీవన వృక్షం అని ప్రసిద్ధి చెందిన కొబ్బరి చెట్టు ప్రాధాన్యతను చాటడం, దాని ఆధారంగా జీవనోపాధి సాగిస్తున్న కోట్లాది మంది రైతుల కృషిని గుర్తించడం, పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఆసియా పసిఫిక్ కొబ్బరి సమాజం అనే అంతర్జాతీయ సంస్థ 1999లో స్థాపించ బడింది. దీనిని పురస్కరించుకుని 2009లో మొదటి.సారిగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపు కున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న దీన్ని గుర్తుగా పాటిస్తున్నారు. ఈ సంస్థలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన 18 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కొబ్బరి పంట ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ, రైతుల ఆదాయాభివృద్ధి లక్ష్యాలతో ఈ వేదిక ఏర్పడింది.



కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలవడానికి కారణం దాని ప్రతి భాగం ఉపయోగకరమై ఉండడమే. వేర్లు, కాండం, ఆకులు, పండు అన్నీ మానవ జీవితానికి ఉపయోగ పడతాయి. కొబ్బరి నీరు సహజమైన ఎలక్ట్రోలైట్‌లకు నిలయం. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీటిలో సుమారు 19 క్యాలరీలు, 4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 25 మిల్లీ గ్రాముల సోడియం ఉంటాయి. క్రీడాకారులకు, శ్రమతో జీవించే వారికి ఇది సహజ శక్తినిస్తుంది. కొబ్బరి నూనెలో 90 శాతం మధ్యస్థ శృంఖల కొవ్వు ఆమ్లాలు (వీజుం) ఉంటాయి. వీటిలో లౌరిక్ ఆమ్లం శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొబ్బరి పాలు విటమిన్ సి, ఇ, బి కంప్లెక్స్, ఇనుము, మగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో నిండిపోయి ఉంటాయి. కొబ్బరి తురుము మిఠాయిలు, వంటకాల్లో రుచిని పెంచడమే కాకుండా అధిక ఫైబర్‌తో జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

కొబ్బరి చెట్టు ఆకులను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పుల కోసం, చాపలు, ముట్టెలు తయారీకి ఉపయోగిస్తారు. పీచు నుండి తాడులు, గోనె సంచులు, పరుపులు, బ్రష్‌లు తయారవుతాయి. తాటి కాండంతో గృహోపకరణాలు, ఫర్నిచర్ తయారు చేస్తారు. చిప్పలను బయోమాస్ ఇంధనంగా వినియోగిస్తారు. కొబ్బరి చెట్టు వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అమూల్యమైన వనరుగా నిలుస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 6.3 కోట్ల మెట్రిక్ టన్నుల కొబ్బరి ఉత్పత్తి అవుతుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశం మూడు ప్రధాన ఉత్పత్తి దారులు. వీటి లోనే ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం వస్తుంది. భారత దేశం రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023 గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల హెక్టార్లకు పైగా కొబ్బరి సాగు విస్తరించి ఉంది. సంవత్సరానికి సుమారు 1.9 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేరళ ఒక్కదాని లోనే దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా కూడా ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలు. దేశ వ్యాప్తంగా సుమారు 20 కోట్ల ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా కొబ్బరి ఆధారిత జీవనోపాధిపై ఆధారపడి ఉన్నారు.

కొబ్బరి ఉత్పత్తుల ద్వారా భారత దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. కోయిర్ ఉత్పత్తులు, కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి, కొబ్బరి నీటితో తయారైన పానీయాలు, హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగుమతుల్లో ప్రధాన భాగం. కేవలం కోయిర్ ఉత్పత్తుల ద్వారానే 2022--23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,340 కోట్ల రూపాయల ఎగుమతులు జరిగాయి. ఈ పరిశ్రమలో లక్షలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

అయితే కొబ్బరి పరిశ్రమకు సవాళ్లు తక్కువ కావు. దేశ వ్యాప్తంగా పంటలో 30శాతం చెట్లు వయసు పైబడినవే. దిగుబడి తగ్గిపోవడం సహజం. కొత్తగా నాటే మొక్కలకు ప్రోత్సాహక పథకాలు అవసరం. కొబ్బరి చెట్లకు రూట్ విల్ట్, బ్లాక్ హెడ్, కీటకాల దాడి వంటి వ్యాధులు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి. మార్కెటింగ్ సౌకర్యాల లేమి, శ్రామికుల కొరత సమస్యలలో ముఖ్యమైనవి. ఒక చెట్టుపైకి ఎక్కి కాయలు కోయగల నైపుణ్యం కలిగిన శ్రామికులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. దీంతో రైతులు అధిక ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం ఈ సమస్యలను గుర్తించడానికి, వాటి పరిష్కార మార్గాలను చర్చించడానికి ఒక మంచి వేదిక. ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన థీమ్ ప్రకటించి రైతుల ఆదాయాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు, సాంకేతికత వినియోగం, మార్కెట్ విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కొబ్బరి పరిశ్రమ భవిష్యత్తు స్థిరంగా ఉండాలంటే పంట సంరక్షణ, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు రైతులకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఇది జీవనానికి, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. కోట్లాది మంది రైతుల కష్టానికి గౌరవం ఇవ్వడం, ఈ వనరును భావి తరాలకు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి మనకు ప్రసాదించిన ఈ కల్ప వృక్షాన్ని కాపాడుకోవడం ద్వారానే గ్రామీణాభివృద్ధి, స్థిరమైన జీవన విధానం సాధ్యమవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జన హృదయ నేత వైఎస్

### నేడు రాజశేఖర్ రెడ్డి వర్ధంతి


తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు, ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి డాక్టర్ యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (వైఎస్సార్) వర్ధంతి సందర్భంగా నేడు (సెప్టెంబర్ 2) ఆయన సేవలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్మరించుకుంటున్నారు. 1949 జూలై 8న జమ్మలమడుగులోని సీఎస్ఐ కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జయమ్మ, రాజారెడ్డి దంపతులకు జన్మించిన వైఎస్సార్, బళ్ళారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ప్రాథమిక విద్యను, విజయవాడ లయోలా కళాశాలలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. గుల్బర్గా విశ్వవిద్యాలయం నుంచి ఎంపీబీఎస్ పట్టా పొంది, తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ కళాశాలలో హౌస్ సర్జన్ చేశారు. గుల్బర్గా ఎంఆర్ఎం వైద్య కళాశాలతో పాటు ఎస్వీఆర్ఆర్‌లోనూ విద్యార్థి/హౌస్ సర్జన్ సంఘాల అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు చాటారు. ఆ తర్వాత జమ్మలమడుగు సీఎస్ఐ ఆసుపత్రిలో వైద్యాధికారిగా,



పులివెందులలో తన తండ్రి పేరిట నిర్మించిన 70 పడకల ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలు అందించారు. వీరి కుటుంబం పులివెందులలో నెలకొల్పిన కళాశాలలను లయోలా సంస్థలకు అప్పగించగా, సింహాద్రిపురంలోని కళాశాలను ఇప్పటికీ వారి కుటుంబమే నిర్వహిస్తోంది.

1978లో పులివెందుల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వైఎస్సార్, అక్కడ నుంచి 6 సార్లు శాసనసభ్యుడిగా మరియు కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎంపీగా విజయం సాధించి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఓటమనేదే ఎరుగని నేతగా నిలిచారు. 1980-83 కాలంలోనే గ్రామీణాభివృద్ధి, వైద్యం, విద్యా, ఎక్సైజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. 1983-85 మరియు 1998-2000 మధ్య రెండు పర్యాయాలు ఏపీసీసీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. కాంగ్రెస్ పార్టీలో మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి వంటి సీనియర్లతో విభేదిస్తూ నిత్య అసమ్మతివాదిగా పేరుపొందిన ఆయన, సొంత పార్టీ నేతలపై రాజకీయ పోరాటాలు సాగించారు. నాడు నగరంలో జరిగిన అల్లర్లలో వైఎస్సార్ వర్గం పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చినప్పటికీ, తదనంతర కాలంలో తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి పార్టీలో ఎలాంటి శిబిరాలు లేకుండా సర్వహక్కులు సాధించుకోగలిగారు. 1999 నుంచి 2004 వరకు ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన ఆయన, 2003 వేసవిలో చేపట్టిన 1,467 కిలోమీటర్ల చారిత్రాత్మక పాదయాత్ర ద్వారా ప్రజల్లో అపారమైన జనాదరణ పొంది మునిగిపోతున్న కాంగ్రెస్ నావను ఒడ్డుకు చేర్చారు.

2004 మేలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తొలిసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన వైఎస్సార్, తన పాదయాత్ర హామీ మేరకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. జలయజ్ఞం కింద పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశారు. క్రైస్తవ విశ్వాసాలు పాటిస్తూనే బెత్లహేమ్ యాత్రలు చేసిన ఆయన, పరంపరగా వస్తున్న హిందూ సంప్రదాయాలను వీడకుండా తిరుమల శ్రీవెంకటేశ్వర



స్వామిని అనేకమార్లు దర్శించుకునేవారు. 2009 ఎన్నికల్లో శాసనసభలో 156 స్థానాలు, లోక్‌సభలో 33 స్థానాలు సాధించి కాంగ్రెస్‌ను ఒంటిచేత్తో గెలిపించి వంసగా రెండోసారి సీఎం అయ్యారు. అయితే, 2009 సెప్టెంబర్ 2న చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తుండగా ఉదయం 9:35 గంటలకు హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోగా, నల్లమల అడవుల్లో సంభవించిన ప్రమాదంలో ఆయనతో పాటు ఐదుగురు మరణించారు. ఆయన మరణవార్తను తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67 మంది గుండె ఆగి మరియు ఆత్మహత్యల వల్ల ప్రాణాలు కోల్పోవడం ఆయన పట్ల ప్రజలకున్న అభిమానానికి నిదర్శనం. భౌతికంగా దూరమైనా ఆయన అందించిన పాలన, సంక్షేమ పథకాలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ఫ్యాషన్‌తో అదరగొట్టిన నవోమి ఒసాకా

- యూఎస్ ఓపెన్‌లో ప్రత్యేక ఆకర్షణ
- వెరైటీ గెటప్‌తో అట్రాక్ట్ చేసిన నవోమి ఒసాకా

**స్పోర్ట్స్ డెస్క్:**

మహిళల టెన్నిస్ స్టార్ నవోమి ఒసాకా ఆటతోనే కాదు తన ఫ్యాషన్ సెన్స్‌తోనూ వార్తల్లో నిలుస్తుంటుంది. గ్రాండ్‌స్లామ్ టోర్నీ అనగానే ఈ ఫ్యాషనిస్టా.. ట్రెండీ దుస్తుల్లో, ఏదైనా థీమ్‌తో కూడిన డ్రెస్‌లో వైరలవుతుంటుంది. ప్రతిసారి సరికొత్త డ్రెస్సింగ్స్‌ను ఎంచుకుంటూ తొలిరౌండ్ కోసం కోర్టులో అడుగుపెడుతుందీ జపాన్ ప్లేయర్. ఇప్పుడు యూఎస్ ఓపెన్‌లో ఆరంభ పోరు కోసం ఒసాకా బాస్కెట్ బాల్ దిగ్గజం లుక్‌తో వచ్చి అందర్నీ అబ్బురపరిచింది. టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేసే నవోమి ఒసాకా మరోసారి వైరలవుతోంది. యూఎస్ ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ తొలి మ్యాచ్ కోసం ఈ జపాన్ ప్లేయర్ వెరైటీగా.. బాస్కెట్ బాల్ దిగ్గజం గెటప్‌లో వచ్చింది. అమెరికా మాజీ ఆటగాడు, ఎన్‌బీఏ గ్రేట్ అలెన్ ఐవెర్సన్ మాదిరిగా కోర్టులో అడుగుపెట్టింది ఒసాక. పొడవాటి తెల్లని స్కర్ట్ దానిపై వదులుగా ఉన్న హుడీ ధరించింది. కోర్టులోకి వచ్చాక.. ఆ డ్రెస్ తీసేసిన ఒసాక.. ఐవెర్సన్ లుక్‌తో అందర్నీ ఆశ్చర్యపరిచింది. అచ్చం అమెరికా వెటరన్ స్టయిల్లో తన జట్టును కార్న్ రోస్ తరహాలో డిజైన్ చేయించుకుంది తను. తద్వారా అతడిపై తనుకున్న అభిమానాన్ని చాటుకుంది ఒసాక. అంతేకాదు కోర్టులోకి రావడానికి ముందు ఐవెర్సన్ ఫొటో ముద్రించి ఉన్న షర్ట్‌ను ధరించిందీ టెన్నిస్ స్టార్. తన కొత్త స్టయిల్ గురించి అడుగగా.. 'నాకు ఐవెర్సన్ అంటే ఇష్టం. అతడు కూడా నాలానే రకరకాల ఫ్యాషన్‌లు ప్రయత్నించేవాడు. అతడు తన ఆటతో, స్టయిల్‌తో ఎన్‌బీయే ఆటగాళ్ల డ్రెస్‌ను మార్చేశాడు. స్పోర్ట్స్‌లో క్రీడాకారుల దుస్తులపై సుదీర్ఘ చర్చలు జరుగుతాయని తెలుసు. మన గురించి మనం ఫ్యాషన్ ద్వారా తెలియజేయవచ్చు. ఆ విషయంలో ఐవెర్సన్ అద్భుతం' అని ఒసాక పేర్కొంది. తన స్టయిల్‌తో కోర్టులోకి వచ్చిన జపాన్ ప్లేయర్‌ను ఐమెర్సన్ అభినందించాడు. 'వావ్.. ఎంతగొప్ప గౌరవం. నువ్వు నాకు బిగ్ ఫ్యాన్. నిన్ను చూసేందుకు ఎదురుచూస్తున్నా' అతడు మెసేజ్ పంపాడు.

**నిరుడు లబుబ్ డాల్స్‌తో..**

గత ఏడాది కూడా యూఎస్ ఓపెన్‌లో 'లబుబ్ డాల్స్'తో నెట్టింట వైరలైన ఒసాక.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కూడా వినూత్న వేషధారణతో తళుక్కుమంది. తొలి రౌండ్ మ్యాచ్ కోసం కోర్టుకు ఆమె ఆక్వా బ్లూ(సుమద్రపు నీలిరంగు)టై డై ట్రాక్‌సూట్ జాకెట్.. దానికి మ్యాచింగ్‌గా తెల్లని పలోజాను పోలిన వెడల్పాటి ప్యాంట్ ధరించింది. ముఖాన్ని కవర్ దాదాపుగా కవర్ చేసేలా తెల్లని మేలి ముసుగు, తెల్లని టోపీ, చేతిలో తెలుపు రంగు గొడుకు పట్టుకొని ఫ్యాషన్ సుందరిలా నడుస్తూ కోర్టులోకి విచ్చేసింది ఒసాకా. స్టయిల్ సింబల్‌గా పేరొందిన ఒసాకా 'ఆక్వా బ్లూ' అండ్ వైట్ లుక్‌లో కోర్టులోకి రావడం చూసి ప్రేక్షకులే కాదు కామెంటేటర్లు కూడా అవాక్కయ్యారు.

# ముంబై కెప్టెన్‌గా హార్దిక్ ఔట్?




**ముంబై ఇండియన్స్ కొత్త సారథి రేసులో బుమ్రా, తిలక్**

**కేవలం కెప్టెన్సీ విషయంలోనే కీలక మార్పులు ఉండనున్నట్లు సంకేతాలు**

**రోహిత్ శర్మ, కోచ్ జయవర్దనే మీటింగ్.. జట్టులో మార్పులపై చర్చ**

**ముంబై ఇండియన్స్ నయా కెప్టెన్ ఎవరవుతారని సస్పెన్స్**

**స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2027 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ జట్టులో కీలక మార్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. జట్టు సారథ్య బాధ్యతల నుంచి హార్దిక్ పాండ్యాను తప్పించి కొత్త కెప్టెన్‌ను నియమించే పనిలో ముంబై ఇండియన్స్ ఉన్నట్లు సమాచారం. కెప్టెన్సీ కోల్పోయినా.. ఆటగాడిగా హార్దిక్ పాండ్యా ముంబై జట్టులోనే కొనసాగనున్నట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యాతో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ చర్చలు కొనసాగుతున్నాయని, ప్లేయర్‌గా కొనసాగేందుకు అతను సుముఖంగా ఉన్నాడని టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. అప్‌కమింగ్ సీజన్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఫ్రాంచైజీ అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది.

**పుకార్లుకు ముంబై చెక్..**

ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ జట్టులో ప్రక్షాళన జరుగుతుందని, కోచ్‌లతో పాటు ఆటగాళ్లను మార్చేస్తారని ప్రచారం జరిగింది. కానీ ముంబై మేనేజ్‌మెంట్ మాత్రం కెప్టెన్సీ మినహా ఎలాంటి మార్పులు చేసేందుకు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసినప్పటి నుంచి హార్దిక్ పాండ్యా జట్టు వీడుతాడని, ట్రేడింగ్ ద్వారా ఇతర జట్లలోకి వెళ్తాడని జోరుగా ప్రచారం సాగింది. సీఎస్‌కే, కేకేఆర్, రాజస్థాన్ రాయల్స్ జట్లు హార్దిక్ పాండ్యా కోసం ముంబై ఇండియన్స్‌తో చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. కానీ ముంబై ఇండియన్స్ మాత్రం ఈ వార్తలను ఖండించింది. హార్దిక్ పాండ్యాను రిలీజ్ చేయమని, రిటైన్ చేసుకుంటామని స్పష్టం చేస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టింది.

**కెప్టెన్సీ రేసులో తిలక్ వర్మ, బుమ్రా..?**

ఈ సమావేశంలో ముంబై ఇండియన్స్ ఓనర్స్‌తో పాటు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ మహేళ జయవర్దనే పాల్గొన్నట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ నయా కెప్టెన్‌గా తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా పేర్లను పరిశీలిస్తున్నట్లు జట్టు వర్గాలు పేర్కొన్నాయి. సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై జట్టులోనే కొనసాగేందుకు సుముఖంగా ఉన్నాడని సమాచారం.

# అతడు ఆడనప్పుడు నేను ఏం చేయాలి?

- మెస్సి రిటైర్మెంట్‌పై తల్లి, భార్య ఎమోషనల్
- తన ప్రయాణం పట్ల గర్వంగా ఉందన్న సతీమణి

**స్పోర్ట్స్ డెస్క్:**




ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి తన కెరీర్‌కు వీడ్కోలు పలకడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మెస్సి రిటైర్మెంట్, ఆయన తండ్రి జార్జ్ మెస్సి మరణం ఒకే సమయంలో జరగడంపై అతడి తల్లి సెలియా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా మెస్సి ఆట గురించి తన భర్త అన్న మాటలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మెస్సి తండ్రి జార్జ్ మెస్సి గత నెల ఆగస్టు 8న రోసారియోలో తుదిశ్వాస విడిచారు. కొడుకు ఫుట్‌బాల్‌కు దూరమయ్యే రోజు వస్తే తన పరిస్థితి ఏమిటని జార్జ్ మెస్సి తరచూ ఆందోళన చెందేవారు. సరిగ్గా ఆయన మరణించిన కొన్ని వారాలకే మెస్సి కూడా అంతర్జాతీయ జెర్సీకి వీడ్కోలు పలకడం గమనార్హం.

ఈ పరిణామాలపై మెస్సి తల్లి సెలియా అమెరికా టీవీతో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "నేను ఇప్పటికీ ఏడుస్తూనే ఉన్నాను. మాకు ముందే ఈ నిర్ణయం గురించి తెలిసినా, కుటుంబం మొత్తం బాధలో ఉన్నాం. కానీ, నా కొడుకు సంతోషంగా ఉండటమే మాకు ముఖ్యం. ఆయన తండ్రి ఎప్పుడూ ఒక మాట అనేవారు. 'అతను(మెస్సి) ఇకపై ఆడకపోతే నేను ఏం చేయాలి?' అని బాధపడేవారు. చివరికి ఆయన మరణం, మెస్సి రిటైర్మెంట్ దాదాపు ఒకే సమయంలో జరిగాయి" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**నీపై ఉన్న ప్రేమ అనంతం: మెస్సి భార్య ఆంటోనెలా భావోద్వేగ సందేశం**

మెస్సి సతీమణి ఆంటోనెలా రోక్కుజ్జో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రాసిన ఒక సుదీర్ఘ భావోద్వేగ సందేశం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెస్సి సుదీర్ఘ ప్రయాణాన్ని, ఆయన పడిన శ్రమను ఆమె ఆ లేఖలో పంచుకున్నారు. మెస్సి తన ప్రయాణాన్ని చూసి ఎంతో గర్విస్తున్నామని చెప్పారు.

**'ప్రపంచ కప్‌ను పైకి ఎత్తడం మన పిల్లలు చూశారు'**

ఈ మొత్తం ప్రయాణంలో తనను కదిలించిన విషయం మరొకటి ఉందని ఆంటోనెలా చెప్పుకొచ్చారు. "మన పిల్లలు ఇదంతా ప్రత్యక్షంగా చూస్తూ పెరగడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతినిచ్చింది. తమ తండ్రి తను కోరుకున్న దాని కోసం ఎలా పోరాడాడో, ఎప్పటికీ వెనకడుగు వేయకుండా చివరి వరకు ఎలా నమ్మాడో వారు చూశారు. నువ్వు ఇదంతా సాధించి, ప్రపంచ కప్‌ను పైకి ఎత్తడం వారు కళ్లారా చూశారు. ఒకరోజు మన పిల్లలు నీ గొప్పతనాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటారు. ప్రస్తుతానికైతే వారు తమ తండ్రి విషయంలో గర్వంతో ఉన్నారు. నీ ప్రయాణం పట్ల, నువ్వు ఎదుర్కొన్న సవాళ్ల పట్ల, అన్నిటికంటే మించి నీ వ్యక్తిత్వం పట్ల నేను గర్విస్తున్నాను. నీ పక్కనే నిలబడి ఆ ప్రయాణంలో భాగమవడం నా అదృష్టం. నీపై మాకు ఉన్న ప్రేమ అనంతం" అని ఆంటోనెలా పేర్కొన్నారు.

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు టీమిండియా ప్రకటన

- మందితో కూడిన జట్టును వెల్లడించిన బీసీసీఐ
- బుమ్రా, నితీష్ రెడ్డి రీఎంట్రీ, వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ
- మళ్లీ చోటు దక్కించుకున్న సంజూ శాంసన్, ఇషాన్ కిషన్
- ప్రాక్టీస్‌లో గాయంతో మరోసారి దూరమైన హార్దిక్ పాండ్య



**స్పోర్ట్స్ డెస్క్:**

అఫ్గానిస్థాన్ జరిగే మూడు టీ20ల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను మంగళవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. గాయాలతో జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లు పునరాగమనం చేశారు. అయితే ఈ నలుగురు ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని బీసీసీఐ పేర్కొంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో నెగ్గితేనే జట్టులో కొనసాగుతారని స్పష్టం చేసింది.

సంజూ శాంసన్ రీఎంట్రీ ఇవ్వగా.. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. ప్రాక్టీస్‌లో అతని కాలికి గాయం కావడంతోనే ఎంపిక చేయలేదనే వాదన వినిపిస్తోంది. అయితే బీసీసీఐ మాత్రం హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నితీష్ రెడ్డి రీఎంట్రీ ఇవ్వడంతో సూర్యాన్ష్ షెడ్గే చోటు కోల్పోయాడు. ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యాను ఎంపిక చేస్తారని ప్రచారం జరిగినా.. సెలెక్టర్లు ఏ మాత్రం పట్టించుకోలేదు. జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా రీఎంట్రీతో గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్ వంటి యువ పేసర్లకు అవకాశం లేకుండా పోయింది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా ఈ మూడు టీ20ల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. అఫ్గాన్‌లో సరైన క్రికెట్ మైదానాలు లేకపోవడంతో ఆ జట్టు దుబాయ్, భారత్ వేదికగా తమ ఆతిథ్య మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

**అఫ్గాన్‌తో టీ20 సిరీస్ భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్(కీపర్), సంజూ శాంసన్(కీపర్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్) శివమ్ దూబే, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా*, హర్షిత్ రాణా*, నితీష్ కుమార్ రెడ్డి*, వాషింగ్టన్ సుందర్*.

# సెంచరీతో మెరిసిన తిలక్ వర్మ

- దులీప్ ట్రోఫీ సెమీస్‌లో సౌత్ జోన్ దూకుడు
- నార్త్ జోన్‌పై పట్టు బిగించిన సౌత్ జోన్
- శతకంతో అదరగొట్టిన తిలక్ వర్మ, తృటిలో కోల్పోయిన శ్రేయస్ గోపాల్

**స్పోర్ట్స్ డెస్క్:**

ట్రోఫీ 2026లో భాగంగా నార్త్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్ 2లో సౌత్ జోన్ పట్టు బిగించింది. తిలక్ వర్మ(250 బంతుల్లో 9 ఫోర్లతో 116 నాటౌట్) అజేయ శతకంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. అనంతరం బౌలింగ్‌లోనూ సత్తా చాటడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్ 66 ఓవర్లలో 7 వికెట్లకు 256 పరుగులు చేసింది. సనత్ సంగ్వాన్(148 బంతుల్లో 8 ఫోర్లతో 76), ఆయుష్ డోసెజా(76 బంతుల్లో 5 ఫోర్లతో 52) హాఫ్ సెంచరీలో రాణించారు. క్రీజులో అన్షుల్ కాంబోజ్(29 బ్యాటింగ్) ఉన్నాడు. సౌత్ జోన్ బౌలర్లలో శ్రేయస్ గోపాల్, కావురి సాయితేజ, మహమ్మద్ నిదీష్ రెండేసి వికెట్లు తీయగా.. విద్వత్ కావేరప్ప ఒక వికెట్ పడగొట్టాడు.

# డైలమాలో ‘జైలర్ 2’



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ‘జైలర్ 2’ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను అక్టోబర్ 15న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే, ఇప్పుడు ఈ సినిమా అనుకున్న సమయానికి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని చెన్నై వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సన్ పిక్చర్స్ నుండి అధికారిక సమాచారం లేకపోయినా, ఈ స్లాట్‌ను ఖాళీగా చూసి మైత్రి సంస్థ ‘రణబాలి’ చిత్రాన్ని అక్టోబర్ 16కి ఫిక్స్ చేసిందని తెలుస్తోంది. ఇక ఇదే సమయంలో వెంకటేష్-త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం ఏకె 47’ కూడా ఈ రేస్‌లోకి రావాలని చూస్తోంది. ఈ వాయిదాకి ప్రధాన కారణం రీ-షూట్స్ అని తెలుస్తోంది. ప్రభుత్వ పనితీరుపై ఉండే కొన్ని సీన్లు విజయ్ ఫ్యాన్స్‌ను ఇబ్బంది పెట్టకుండా దర్శకుడు నెల్సన్ కీలక మార్పులు చేస్తున్నారట. దీంతో, రిలీజ్‌కు కేవలం 45 రోజులే ఉండటంతో చిత్రబృందం ప్రమోషన్లపై పరుగులు తీయాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమా బిజినెస్ డీల్స్ ఇంకా పూర్తి కాకపోవడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ఇటీవల తమిళ డబ్బింగ్ చిత్రాలకు తెలుగులో వచ్చిన ఆదరణను బట్టి, తెలుగు హక్కుల కోసం నిర్మాతలు ఊహించని రేటు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇటీవలే విడుదలైన పూర్ణ స్పెషల్ సాంగ్‌కు మిక్సిడ్ రెస్పాన్స్ రావడం కాస్త చర్చనీయాంశంగా మారింది. చివరి దశ షూటింగ్ త్వరగా పూర్తి చేసి సన్ పిక్చర్స్ క్లారిటీ ఇస్తే తప్ప ఈ వాయిదా ప్రచారానికి తెరపడదు.



# ‘ఐమ్ గేమ్’.. రన్‌టైమ్ ఎంతంటే..?

దుల్కర్ సల్మాన్ లీడ్ రోల్‌లో లేటెస్ట్ చిత్రం ‘ఐమ్ గేమ్’ ఇప్పటికే టీజర్, ట్రైలర్స్‌తో ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 3న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రం తాజాగా సెన్సార్ పనులు ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ‘యూ/ఏ’ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలోని యాక్షన్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించబోతున్నాయని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ చిత్రం 2 గంటల 53 నిమిషాల రన్‌టైమ్‌తో రానున్నట్లు తెలుస్తోంది. కొంచెం లెంగ్తీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను సీటు ఎడ్జ్‌పై కూర్చోబెట్టేలా సినిమా తెరకెక్కినట్లు తెలుస్తోంది. దుల్కర్ సల్మాన్ మరోసారి తనదైన పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ దగ్గర దుల్కర్ తనదైన మార్క్ హిట్ అందుకుంటాడని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.


# కింగ్.. రిస్క్ చేస్తాడా..?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కించనున్న తాజా చిత్రానికి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో అక్కినేని నాగార్జున ఒక కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రంలో నాగార్జునను సంప్రదించగా, దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. సూర్యజ్యోతికల ‘జగరమ్ స్టూడియోస్’ నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా వామికా గబ్బి పేరు పరిశీలనలో ఉంది. రజినీకాంత్ ‘కూలీ’ చిత్రంలో విలన్‌గా నటించిన నాగార్జున, ప్రస్తుతం తన మైలురాయి 100వ సినిమా ‘కింగ్ 100’ పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు సూర్య తన నెక్స్ట్ సినిమాలను పూర్తి చేసిన తర్వాతే హెచ్. వినోద్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తారు. ఈ క్రేజీ కాంబినేషన్ కుదిరితే టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకు ఒక అద్భుతమైన విజువల్ ట్రీట్ లభించడం ఖాయం.

# సెన్సార్ ముగించుకున్న ‘రంభ ఊర్వశి మేనక’

అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ‘రంభ ఊర్వశి మేనక’ ఇప్పటికే ప్రేక్షకుల్లో ఒకింత బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు చంద్ర మోహన్ డైరెక్ట్ చేశారు. ఇక ఈ సినిమాతో అల్లరి నరేష్ మరోసారి తనకు ఎంతో కలిసొచ్చే కామెడీ జోనర్‌తో అలరించేందుకు సిద్ధమయ్యాడు. కాగా, ఈ చిత్రం తాజాగా సెన్సార్ పనులు ముగించుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ‘యూ/ఏ’ సర్టిఫికెట్‌ను మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రం సెన్సార్ పనులు కూడా ముగించుకోవడంతో ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతుంది. సురభి, రాశి సింగ్, విష్ణు ప్రియ, ప్రిషా సింగ్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు చైతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతుంది.



# షాలిని పాండే
# ఫేక్ వీడియో వైరల్



సోషల్ మీడియా విస్తృతి పెరుగుతున్న కొద్దీ సెలబ్రిటీలకు సంబంధించిన డీప్‌ఫేక్, ఏఐ జనరేటెడ్ కంటెంట్ కూడా ఆందోళన కలిగించే స్థాయిలో పెరుగుతోంది. ఇప్పటికే పలువురు సినీ తారలు తమ పేరుతో వైరల్ అయిన మార్ఫింగ్ వీడియోలు, ఫేక్ ఫొటోలపై స్పందించిన విషయం తెలిసిందే. తాజాగా ‘అర్జున్ రెడ్డి’ ఫేమ్ శాలినీ పాండే కూడా డీప్‌ఫేక్ బారిన పడినట్లు వెల్లడించింది.శాలినీ పాండే పేరుతో సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్‌గా మారడంతో ఆమె దీనిపై స్పందించింది. తన పేరుతో చక్కర్లు కొడుతున్న ఆ వీడియో పూర్తిగా నకిలీదని, ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రూపొందించారని ఆమె స్పష్టం చేసింది. అందులో కనిపిస్తున్నది తాను కాదని తేల్చి చెప్పింది. టెక్నాలజీని ఉపయోగించి మహిళలను కించపరిచేలా ఇలాంటి ఫేక్ వీడియోలను రూపొందించడం అత్యంత దారుణమని శాలినీ పాండే ఆవేదన వ్యక్తం చేసింది. తన పేరుతో వైరల్ అవుతున్న వీడియోను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. అలాంటి వీడియోలు కనిపించినప్పుడు వాటిని ఇతరులకు పంపించకుండా, డౌన్‌లోడ్ చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరింది. వీలైనంత త్వరగా ఆ కంటెంట్‌ను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రిపోర్ట్ చేయాలని సూచించింది. ఫేక్ కంటెంట్‌ను షేర్ చేయడం వల్ల అది మరింత మందికి చేరే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేసింది. సెలబ్రిటీల ముఖాలను ఉపయోగించి అసలు వ్యక్తులకు సంబంధం లేని వీడియోలు, ఫొటోలను రూపొందించడం ఇటీవలి కాలంలో పెద్ద సమస్యగా మారింది. గతంలో రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, శ్రుతిహాసన్, టబు, ఐశ్వర్య రాయ్ బచ్చన్ తదితర హీరోయిన్ల పేర్లతోనూ డీప్‌ఫేక్ కంటెంట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.తాజాగా శాలినీ పాండే ఘటన కూడా అదే కోవలోకి చేరింది. దీంతో సెలబ్రిటీల డిజిటల్ భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. ఏఐ టెక్నాలజీని సృజనాత్మకంగా ఉపయోగించడంతో పాటు దుర్వినియోగం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, షాలినీ పాండే 2017లో విజయ్ దేవరకొండ సరసన నటించిన ‘అర్జున్ రెడ్డి’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది.

Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**



# హాస్యం పండించడంలో సాటి లేని మేటి భమిడిపాటి

## నేడు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు వర్ధంతి

హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చమ్మ దంపతుల కు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి .....వాటిల్లో కొన్ని తీసుకుంటే.. మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి...పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి... జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజా; ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉ న్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాఖీ.. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి పండుగ

- శ్రావణ పౌర్ణమికి ఎన్నో విశిష్టతలు
- జంధ్యాల పౌర్ణమి.. నారికేళ పూర్ణిమగానూ ప్రాచుర్యం
- ఉపాకర్మతో వేదాధ్యయనానికి శ్రీకారం
- సోదరుడి క్షేమం కోరుతూ సోదరి కట్టే రక్షాబంధనం
- పురాణ కాలం నుంచి కొనసాగుతున్న పవిత్ర సంప్రదాయం



శ్రావణ పౌర్ణమి అంటే కేవలం రాఖీ పండుగ మాత్రమే కాదు. ఆధ్యాత్మికత, కుటుంబ అనుబంధాలు, వేద సంప్రదాయాలు మేళవించిన విశిష్ట పర్వదినం. హయగ్రీవ జయంతిగా, జంధ్యాల పౌర్ణమిగా, రాఖీ పౌర్ణమిగా, నారికేళ పూర్ణిమగా వివిధ ప్రాంతాల్లో ఈ పర్వదినం ప్రసిద్ధి చెందింది. ప్రాంతాన్ని బట్టి ఆచారాలు మారినా.. రక్షణ, శ్రేయస్సు, అనుబంధం అనే భావనలే ఈ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తాయి. వర్షాకాలం రాకను స్వాగతిస్తూ మధుర పదార్థాలను స్వీకరించడం కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం. వరుణ దేవుడి అనుగ్రహం కోసం కొబ్బరికాయలను సమర్పించే ఆచారం కారణంగా దీనికి 'నారికేళ పూర్ణిమ' అనే పేరు వచ్చింది. ముంబయి సహా పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ రోజున సముద్రాన్ని పూజించి వరుణ దేవుడి కరుణ కోరడం ఆనవాయితీ. పూర్వకాలంలో సముద్రయానాలు, వర్తక కార్యకలాపాలకు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది.

### జంధ్యాల పౌర్ణమిగా ప్రత్యేకత

శ్రావణ పౌర్ణమికి వేద సంప్రదాయంలోనూ విశిష్ట స్థానం ఉంది. పూర్వకాలంలో ఉపాకర్మ అనంతరం వేదాధ్యయనాన్ని ప్రారంభించేవారు. ఉపాకర్మ అనేది కేవలం పండుగ కాకుండా వేదాధ్యయనానికి సంబంధించిన ముఖ్యమైన వైదిక కర్మగా భావిస్తారు. యజ్ఞోపవీతంలోని మూడు పోచలకు ఆధ్యాత్మికంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలైన త్రిమూర్తులను అవి సూచిస్తాయని సంప్రదాయ విశ్వాసం. జంధ్యాల పౌర్ణమి రోజున యజ్ఞోపవీతాన్ని మార్చుకొని వైదిక కర్మలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఋషులను స్మరించుకుంటూ ఋషి పూజలు, ఋషి తర్పణాలు నిర్వహిస్తారు. గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి మహర్షులను సప్తర్షులుగా పేర్కొనే సంప్రదాయం ఉంది. ఇతర పురాణ గ్రంథాల్లో సప్తర్షుల జాబితాలో భిన్నమైన పేర్లు కూడా కనిపిస్తాయి. యజుర్వేద సంప్రదాయంలో పౌర్ణమి తిథికి, ఋగ్వేద సంప్రదాయంలో శ్రవణ నక్షత్రానికి, సామవేద సంప్రదాయంలో హస్త నక్షత్రానికి ఉపాకర్మలో ప్రాధాన్యం ఉన్నట్లు వైదిక సంప్రదాయాలు పేర్కొంటాయి.



### రాఖీ.. ఓ దారమే కాదు

శ్రావణ పౌర్ణమికి ప్రజల్లో అత్యంత ప్రాచుర్యం తెచ్చింది రక్షాబంధనం. సోదరి తన సోదరుడి ముంజేతికి రాఖీ కట్టి అతడి ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కోరుతుంది. సోదరుడు తన సోదరికి జీవితాంతం అండగా ఉంటాననే భావనను వ్యక్తం చేస్తాడు. అందుకే రాఖీ కేవలం రంగురంగుల దారం కాదు.. సోదరీసోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తోంది. రాఖీని పట్టు లేదా నూలు దారాలతో తయారు చేయడం పూర్వపు సంప్రదాయం. కాలక్రమంలో అది రంగురంగుల అలంకరణలతో ఆభరణాన్ని తలపించేలా మారింది. సోదరుడికి బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, రాఖీ కట్టడం.. అనంతరం సోదరుడు సోదరికి కానుక అందించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

### పురాణాల్లోనూ రక్షాబంధనం

రక్షాబంధనానికి సంబంధించి పురాణాల్లో పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ధర్మరాజు శ్రీకృష్ణుడిని రక్షణకు మార్గం అడిగినప్పుడు రక్షాబంధన విధిని వివరించినట్లు ఒక కథనం చెబుతుంది. దేవాసుర సంగ్రామ సమయంలో ఇంద్రాణి ఇంద్రుడికి రక్షను కట్టి విజయాన్ని ఆకాంక్షించిన కథ కూడా రక్షాబంధన ప్రాశస్త్యంతో ముడిపడి ఉంది. కాలక్రమంలో రక్షాబంధనం సోదరీసోదరుల అనుబంధానికి ప్రధాన చిహ్నంగా మారింది. రక్తసంబంధం లేకపోయినా ఒక మహిళ పురుషుడికి రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేసే సంప్రదాయం కూడా ఏర్పడింది. రాఖీ స్వీకరించిన వ్యక్తి ఆమెకు అండగా, రక్షకుడిగా ఉండాలన్న భావన దీనిలో కనిపిస్తుంది.

### అనుబంధాలకు అక్షయ తోరణం

కాలం మారింది.. జీవన విధానాలు మారాయి.. కుటుంబాలు ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలకు విస్తరించాయి. కానీ రాఖీ కట్టే చేతిలోని ఆప్యాయత మాత్రం మారలేదు. చిన్న తోరంతో మొదలయ్యే ఈ వేడుక సోదరీసోదరుల మధ్య జీవితకాల అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. అందుకే రాఖీ అంటే చేతికి కట్టే దారం మాత్రమే కాదు.. 'నీకు నేనున్నా' అని ఇచ్చే భరోసా. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి చిరునామా.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు



"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు. గుర్రపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్ళుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు, ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుర్రం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్థనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి, నిలబడే నిద్ర పోయారు. విష్ణువును వెదకుతూ వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్థించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుర్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్లుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారు బ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవ నామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి. హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది. ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494